# ఇండస్ట్రీ

సుబ్బిగాడు ఈమధ్య ఎవరితోనో గానీ అన్నాట్ట, నేను వాడికి తిరుక్షవరం చేశానని. నమ్మకండి. పచ్చి అబద్ధం.

ఆమాటకొస్తే నాచేత గొరిగించుకునేందుకు వాడిదగ్గరేముంది గనుక. పాతికేళ్ళకే జీవితాన్ని శుభ్రంగా క్షవరం చేయించుకున్నవాడికి అదనంగా నేను చేసేందుకేముంటుంది చెప్పండి!

సంగతేమంటే, వాడో బుల్లి నక్సలైటు. నక్సలైట్లకు దేశభక్తి ఉండదని మీకు నేను గుర్తుచేయనక్కర్లేదుగదా!

నా ఖర్మకొద్దీ సుబ్బిగాడివి సరిగ్గా మా ఎదురిల్లే. మూడేళ్ళుగా వాడు నిరుద్యోగిగా, నేను ఉద్యోగిగా ఉంటున్నప్పటికీ అంతకుముందు మాత్రం మే మిద్దరం క్లాస్‌మేట్లం! ఒకే బస్సులో కాలేజీకెళ్ళి వస్తూ, అడపాదడపా ఒకే హోటల్లో ఒకే టేబిల్‌ముందు కూర్చుని ఒన్‌బైటూ కాఫీలు సేవించిన దోస్తులం.

అయితే, కాలేజీలో మాత్రం వాడి దోస్తులువేరు. వాళ్ళ కబుర్లు వేరు. వాళ్ళకి పాఠాలమీదకన్నా పత్రికలమీద శ్రద్ధ ఎక్కువ. లెక్చరర్లమీద కన్నా రాజకీయ లెక్చెరర్లమీద భక్తి ఎక్కువ.

అసలు సుబ్బిగాడిలా పాడైపోవటానికి కారణం ఆ దోస్తులేనని నా అనుమానం.

ఇద్దరంకలసి చదివాం. ప్యాసయ్యాం. ఇంక చదివేందు కేం లేదు గనుక ఉద్యోగాన్వేషణలోకి దిగాం.

అక్కడేవచ్చింది అసలు గొడవ.

మా బాబు కాస్త ఉన్నవాడు. నా ఉద్యోగంకోసం ఓ మూడువేలు తేలిగ్గా పెట్టుబడి పెట్టగలిగాడు. ఫలితంగా పరీక్ష ప్యాసయినట్లు తెలిసిన మూడు నెలల్లోగా ఉద్యోగినయిపోయాను. వెధవది; మూడువేలు పోతే పోయింది. ఆర్నెల్లజీతం గదా! మూడేళ్ళుగా నేను ఉద్యోగం చేయటం లేదా! ఆ ఉద్యోగమే లేకుంటే నామొఖానికి నలభై వేల కట్నంతో పిల్ల నిచ్చేందుకు ఎవడు ముందుకు వచ్చేవాడు చెప్పండి.

నేనో దారిన పడగానే మనవాడేగదా అని సుబ్బిగాడికూడా ఓ ఉద్యోగం వెతికాను జీతం మూడొందలే అయినా వాళ్ళుకూడా మూడు వేలు ముడుపు అడిగారు.

అయిదొందల ఉద్యోగానికీ, మూడొందల ఉద్యోగానికీ కూడా ముడుపు సమానమేనా! అని ఆశ్చర్య పోతున్నారా? అందులో కాస్త లిటిగేష నుందిలెండి. మా బాబు డబ్బుతోపాటు కాస్త పలుకుబడికూడా ఉన్నవాడు. కనుక, నాకు ముడుపులో కన్సెషన్ దొరకటం సహజం.

సుబ్బిగాడిఫాదర్ ఓ బక్క ఎన్జీవో. ఆయన దగ్గర డబ్బులేదు, ఇన్ఫ్లూయెన్సూ లేదు, అప్పులు తప్ప మరేం లేవు.

అయినా మూడువేలు ఏమంత పెద్దమొత్తం చెప్పండి. నాదగ్గర మూడువేలు పుచ్చుకుని ఆర్డర్స్ వేయించిన పెద్దమనిషి ఆయనగారి ముండల సంగతలా ఉంచి బ్రాందీబుడ్లకే నెలకో వెయ్యిన్నర ఊదేస్తాడట. మనవాడి సంగతికొచ్చినా ఓ పదినెల్ల జీతమేగదా!

ఆ పదినెల్లూ అప్రెంటిస్‌గా పని చేశామనుకుంటే పోదూ!

కాని, సుబ్బిగాడు నా మాట విన్నాడుకాదు. "మూడు వేలే? మా బాబునిప్పుడు మర్డర్ చేస్తేతప్ప నాకు మూడువేలు వచ్చేదారిలేదు!"

అని వాపోయాడు వాడు.

వాడిఫాదర్ ఎప్పుడో పదేళ్ళక్రితం కాస్త బాగున్న రోజుల్లో అయిదు వేలకు ఇన్సూరు చేశాట్ట, అదితప్ప వాళ్ళకు మరేం రావాల్సింది లేదట. ఇవ్వాల్సింది మాత్రం చాలా ఉందిట!

"మీ ఫాదర్ని మర్డర్ చేస్తే అయిదు వేలొస్తాయి నిజమే! కానీ, ఆయనగారికి ఉన్న మూడొందల రూపాయల గవర్నమెంటు నౌకరీ ఊడి పోతుంది గదా! మర్డర్ కేసులో జైలుకువెళ్ళి వచ్చేదాకా నీకోసం ఈ ఉద్యోగం ఖాళీగా ఉంచరు గదా!" అన్నా న్నేను.

వాడు వెర్రిగా దిక్కులు చూసేడు. ముందు నన్నే మర్డర్ చేస్తాడేమోనని నాకు భయంవేసిన మాట నిజం.

ఆతర్వాత వాడిఉద్యోగం గురించి నేనంతగా పట్టించుకోలేదు. అడపాదడపా మరెవరూ తోడు దొరకనప్పుడు వాడిని సినిమాలకో, షికార్లకో తీసుకుపోతుండేవాడి నంతే. గాంధీగారు చెప్పారుగదండీ? నీకున్నదాంట్లో కాస్త లేనివాడికి ముష్టివేస్తూ ఉండు. వాడు కనీసం ఊపిరితోనైనా బ్రతికిఉండేలా చూడు. లేకుంటే వాడు నీమీదే తిరగబడి, నీవు కష్టపడి పేర్చుకుంటూన్న బ్యాంకుబ్యాలెన్సుల్ని సఫా చేయగలడు! అని!

అయినా సుబ్బిగాడికేమన్నా విశ్వాసం ఉంటేనా! గాంధీగార్ని చెడ తిట్టేవాడు. ఆయనో తెలివైన కేటు అంటూ దారుణంగా గర్జించేవాడు. దేశాన్ని రాబందులకూ, తోడేళ్ళకూ అప్పగించేందుకే అన్ని త్యాగాలు చేశాడనే వాడు.

నా ఖర్మకొద్దీ చెవులు మూసుకున్నా వినిపించేటంత ఘాటుగా ఉండేవి వాడి ఉపన్యాసాలు.

"తప్పు తమ్ముడూ! మరీ అంత ఘోరంగా ఆలోచించకు! ఆ గాంధీగారి వారసురాలే గదా ఈ గాంధీ కూడా. చూడూ! ఆవిడెన్ని మంచి పనులు చేస్తూందో! నిన్నగాక మొన్ననే గదా! బ్యాంకుల్ని జాతీయం చేసిందావిడ!" అన్నానోసారి. !

వాడు ఉగ్రుడయ్యేడు! బడా నక్సలైటులా ఫోజు పెట్టేడు! నావంక కొరకొరా చూశేడు. పఠ పఠామని నమిలేసే వాళ్ళా కనుపించాడు! "అవును! బ్యాంక్ ఎకౌంట్ ఉన్న వాడివి. నీకు కావల్సిందే ఆ బ్యాంకుల గొడవ బుక్కా ఫకీరు గాడిని! నాకు జరిగేదేమిటి?" అన్నాడు వాడు.

నవ్వొచ్చింది నాకు, వాడి అజ్ఞానం చూసి. రోజూ పేపర్లు మాత్రం శ్రద్ధగా చదివే వీడి పరిజ్ఞానం ఇదా! అయినా ఇలాంటి నక్సలైటు గాళ్ళకు వాస్తవాలు సరిగా అర్థం అయి చావవుగదండీ!

"కాదురా సుబ్బారావూ! బ్యాంకుల జాతీయం వల్ల చాలా లాభాలున్నాయి. ఆ పని చేసిందసలు నీబోటి ఫకీరు గాళ్ళకోసమే. చూడూ! రిక్షాలకు అప్పులిస్తున్నాయిప్పుడు బ్యాంకులు. రైతుల కిస్తున్నాయి. టాక్సీల వాళ్ళకిస్తున్నాయి. ఇది గరీబీల రాజ్యంరా నాయనా! గరీబీల రాజ్యం ఇది. ఈ సంస్కరణలన్నీ నీ బోంట్ల కోసమే." అన్నాన్నేను.

సుబ్బిగాడో మందహాసం చేశేడు. ఎలా ఉంది! గాంధీగారి బోసి నవ్వులా ఉందా అది? అబ్బే! లేదు! కుర్ర సుబ్బిగాడి కుంక నవ్వులా ఉందది. క్షణకాలం పాటు నాకేసి చురచురా చూశేడు. నా తల కాయను చీల్చుకుని లోపలి మెదడులో దేనికోసమో వెతుకు తున్నట్లుగా ఉందా క్రూర, ఘోరచూపు.

"చూడరా సుబ్బారావూ! నీవు టెక్నికల్ కోర్సు చదివిన వాడివి.

డిగ్రీ ఉన్నవాడివి. బ్యాంక్ లోన్ తెచ్చుకొని హాయిగా ఏదేనా ఇండస్ట్రీ పెట్టుకోరాదూ !" అని సలహా యిచ్చేను.

"నేనా ?"— ఆ క్షణాన్ని వాడిది తెల్లబోయిన మొహమా లేక ఏడుపు మొహమా ? అనేది నాకు తెలీలేదు.

"నువ్వే ? ఏం ! నీకేం లోటు ! తాతా బిర్లాల తాతలు కూడా ఇలా చిన్న చిన్న ఇండస్ట్రీలు పెట్టి పైకొచ్చిన వాళ్ళే. శ్రద్ధగా చేసుకుని పైకి రావాలిగానీ, ఓ పదేళ్ళలో బిర్లాయే స్వయంగా వచ్చి నీకు పాతిక లక్షల కట్నంతో పిల్ల నివ్వడా ! మనది శ్రేయోరాజ్యంరా నాయనా ! అందరికీ అవకాశాలున్నాయి. ఎవరైనా పైకి రావచ్చు !" అన్నాన్నేను.

"ఔరా ! అదీ నిజమే ! కానీ, పదేళ్ళ నాటికి నావయస్సు పెరిగి పోతుంది గదా ! మరి బిర్లా నాకు పిల్లనిస్తాడంటావా ? అసలాయనకి కూతుళ్ళున్నారా ?" అని సందేహించాడు వాడు.

వాడి ప్రశ్నలలో సబబుందని పించింది నాకు ! అందువల్ల అప్పుడు వాడి వదనంలోని చిరు నవ్వును నేనంతగా పట్టించు కోలేదు. ఔరా ! సుబ్బిగా ! ఎంత వ్యంగ్యంగా మాట్లాడినావురా ! ఎంత తెలివిగా నవ్వి నావురా !

ఆ తర్వాత ఓ వారం రోజుల్లపాటు వాడికి నూరిపోసి ఇండస్ట్రియ లిస్ట్ అయ్యేందుకు ఒప్పించేను. అప్లికేషన్ ఫారం దగ్గరుండి పూర్తి చేయించేను. స్వయంగా దగ్గరుండి ఇండస్ట్రీస్ డిపార్టుమెంటులో ఇప్పించేను. అక్కడ మా ఫాదర్ స్నేహితులు కొందరు ఆఫీసర్లుంటే వారిలో ఒకరికి మనవాడి సంగతి చెప్పేను. తప్పకుండా వచ్చేలా చేస్తానని ఆయన బల్లగుద్ధ కుండానే హామీ ఇచ్చేడు. తదుపరి మా కిద్దరికీ కాఫీలు కూడా ఇప్పించేడు !

అప్లికేషన్ తీసుకున్న సూపరింటెండెంట్ కూడా చాలా మంచిగా మాట్లాడేడు. "వెధవది! పది వేలకు అప్లికేషన్ పెట్టారేమండీ! పది వేలుతో ఏం ఇండస్ట్రీ పెడతారు! ఇంతవరకూ ఎవరూ ఏభై వేలకు తక్కువకు అప్లికేషన్ పెట్టలేదు!" అన్నాడాయన.

''ప్రస్తుతానికి నాకా పదివేలే పది లక్షలకు సమానం లెండి!'' అన్నాడు మా సుబ్బిగాడు! పాపం! అల్ప సంతోషి!

"సరే! ఓ వారంలోగా ఈ అప్లికేషన్లన్నీ స్క్రూటినీ చేసేసి బ్యాంకుల వాళ్ళకు రికమెండేషన్తో సహా పంపేస్తాం. మీరు మళ్ళీ రానక్కర్లేదు. సరాసరి బ్యాంకుకే ఓ గోనెసంచీ బుజాన్నేసుకుపొండి! అందులో పది వేలూ వేసుకెళ్ళండి! అన్నాడు సూపరిండెంటు.

ఓ నెల తర్వాత సుబ్బిగాణ్నడిగేను "ఏంరా! గోనె సంచీ దొరకలేదా?" అని.

"సంచీ రెడీగానే ఉంది! కానీ. కాగితాలే కదల్లేదు. అవింకా బ్యాంకుకు చేరనే లేదు" అన్నాడు వాడు.

సంగతేమంటే ఆసూపరిండెంటుగారు ఓ పాతిక రూపాయలడగేడుట, ''మీ డాక్యుమెంట్లన్నీ నాలుగేసి కాపీలు టైపు చేయించాలిప్పుడు! మా టైపిస్టులు బిజీగా ఉన్నారు. ఓ పాతిక ఇలా పారేయండి! ఈరాత్రికే ఇద్దర్ని కూచోబెట్టి టైపు చేయిస్తాను! అందరూ అలాగే చేయించు కుంటున్నారు.'' అన్నాడట ఆయన.

సబబేనని పించింది నాకు. పాపం? బక్క ఎన్జీవో టైపిస్టుగాళ్ళు! వాళ్ళకు ఆ మాత్రం అడిగే హక్కులేదా!

పాతికేగదా అని అదేదో నేనే వాడికి అప్పు పెట్టేను. అదీగాక వీడు రేపటి ఇండస్ట్రియలిస్టు. బిర్లాకు కాబోయే అల్లుడు. మనకు వాడితో

అవసరాలుంటాయి గదండీ!

ఓ అర్నెల్లు గడచిపోయేయి. అడపాదడపా సుబ్బిగాణ్ణి అడుగుతూనే ఉన్నాను. ''ఎందాకా వచ్చిందిరా! నీ ఇండస్ట్రీ'' అని.

వాడు చాలా చాలా చెప్పేడు. తిరగగా, తిరగ్గా ఇండస్ట్రీస్ వాళ్ళు పిలిచి ఇంటర్వ్యూ చేశేర్ట. "నీకు పదివేలు అప్పివ్వమని బ్యాంకు వాళ్ళకు రికమెండ్ చేస్తాం! సరే! కానీ, రూల్స్ ప్రకారం అందులో కొంతన్నా అడ్వాన్సుగా పెట్టుబడి పెట్టగల ఆర్థికస్తోమతు మీకుండాలి. మరి మీరు ఓ రెండు వేలు పెట్టుబడి చూపగలరా!" అని అడిగేరట ఇంటర్వ్యూ చేసినవాళ్ళు!

"ఓ! ఉంది! అయితే ముందుగా మా బాబుని మర్డర్ చేయాల్సి ఉంటుంది. ఖూనీలు చేసినవాళ్ళకి అప్పులిచ్చేందుకు మీ రూల్సు ఒప్పుకుంటాయా?" అని అడగబోయి, ఎందుకులె వీళ్ళతో? అని మానేశాట్ట సుబ్బిగాడు.

వచ్చినప్పటి సంగతిగదా అని "ఓ! ఉంది!'' అని డబాయించేట్ట!

ఆ తర్వాత బ్యాంకు వాళ్ళు మన వాడిని కూర్చోబెట్టి ''మీకు లోను శాంక్షన్ చేస్తున్నాం. గోనెసంచీ తెచ్చుకున్నారా?" అని పరామర్శించేరుట!

''లేదుసార్! రేపు గోనెసంచీతో సహా వస్తాను!'' అన్నాట్ట మన వాడు.

''ఓ యస్! ఆ గోనేసంచీతో పాటు ఓ పదివేలకు శెక్యూరిటీగా ఆస్తిపాస్తులు గానీ, మరేమన్నాగానీ తీసుకురండి!" అన్నార్ట బ్యాంకు వాళ్ళు.

"అదేమిటండీ !" అని తెల్లబోయేట్ట మనవాడు !

''అవున్నాయనా ! నువ్వా పదివేలూ పట్టుకెళ్ళి ఇండస్ట్రీ పెట్ట కుండా గుర్రప్పందాల్లో పెడుతే, ఆ తర్వాత అంతా క్షవరం చేయించుకుని సూయిసైడ్ చేసుకుంటే మేం మా డబ్బు ఎవరి దగ్గర్నుండి ఎలా రాబట్టు కోవాలి ?" అని ప్రశ్నించేరట బ్యాంకు పెద్దలు.

"నాకు ఇద్దరు ఫాదర్లుంటే అలాగే చేయగలనండీ ! కానీ ఒక్కరే ఉన్నారు !" అన్నాడట సుబ్బిగాడు.

ఈసారి వాళ్ళు తెల్లబోయేరట.

''మా ఫాదర్ అయిదువేలకే ఇన్సూర్ చేశాడండీ ! ఇద్దరు ఫాద ర్లుంటే బాగుండేదేమో ! మీకు సెక్యూరిటీ చూపగలిగే వాడినేమో !'' అని లేచి వచ్చేశాడట మన వాడు.

అంతా చెప్పి అన్నాడు వాడు !

''ఈ ఆర్నెల్లూ ఇలా వేస్టయిపోయేయి. ఇహ ఉద్యోగాన్వేషణలో పడాలి. అన్నట్టు మేం ఇల్లు మారుతున్నాం ఈ సాయంత్రం ! చాలా దూరం ! ఇహమీదట నీకు ఎక్కువగా కనిపించనేమో !" అన్నాడు వాడు.

"ఎందుకురా, మరీ దూరం పోతున్నారూ ?" అనడిగేను.

"ధరలన్నీ మండి పోతున్నాయ్ ! మా బాబు కొచ్చే జీతంరాళ్ళు తిండికే చాలటం లేదు. ఈ పోర్షన్ను భరించ లేకున్నాం. ఊరి చివర్న కాస్త చవకలో ఓ పెంకుటిల్లు అద్దెకు దొరికింది. మా ప్రక్క పోర్షన్ వాళ్లు కూడా ఇల్లు ఖాళీ చేస్తున్నారు. అన్నట్టు మీ ఫాదర్ ఈ ఇల్లు కొనే శారట గదా ! ఏం చేస్తారేం !" అనడిగాడు !

నిజమే ! మా ఫాదర్ పాతికవేలకు ఈ మధ్యే ఆ ఇల్లు కొనేశారు.

మరో పాతికవేలు పెట్టి ఆ ఇల్లు బాగుచేయించి అద్దెకిచ్చేద్దామని ప్లాను వేశారు. రేపో ఎల్లుండో పని మొదలవుతుంది. పదిరోజుల్లో పూర్తయి పోతుందంటా.

ఆ తర్వాత సుబ్బిగాడు నాకు మళ్ళీ కనపళ్ళేదు. వాడి క్రూరఘోరో పన్యాసాలు వినే దురదృష్టం నాకు తగలలేదు.

మా క్రొత్త ఇల్లు బ్రహ్మాండంగా తయారయింది. ఓ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌కు అరొందలకు అద్దెకిచ్చేశారు మా ఫాదర్. అందులోని ఓ పోర్షన్‌కే సుబ్బిగాడి ఫాదర్ అరవై రూపాయలిచ్చే వాడట! పూర్ ఫెలో! ఇప్పుడక్కడ ఎంతిస్తున్నాడో ఆ పూరిపాకకు!

హాయిగా ఉంది జీవితం. ఈ మధ్యేనాకో ఇంక్రిమెంటొచ్చింది. మాఫాదర్ నాకో స్కూటర్ కొనిపెట్టేరు. అడపాదడపా ఏవేవో కాయి తాల మీద సంతకాలెట్టించుకునేవారు. మన కెందుకండీ పెద్దవాళ్ళ వ్యవ హారాల వివరాలు! నేను కళ్ళు మూసుకుని పెట్టమన్న చోట పెట్టే వాడిని!

ఓ మిత్రుడి పెళ్లి ఫంక్షన్లో మా సుబ్బిగాడికి చాలా హెల్ప్‌చేసిన ఆ ఇండస్ట్రీస్ డిపార్టుమెంటులోని మా ఫాదర్ స్నేహితుడు ఆఫీసర్ కనుపించి పలకరించేరు. కుశల ప్రశ్నలయ్యాక అడిగారు! "ఎలా ఉందోయ్ నీ ఇండస్ట్రీ?" అని.

నాకేం అర్థం గాలేదు. "ఇండస్ట్రీ ఏమిటండీ!" అని తెల్ల బోయేను.

"ఫోజులు కొట్టకోయ్! మా ద్వారా ఏభై వేలు లోన్ కొట్టుకెళ్ళి మమ్మల్నే దబాయిస్తున్నావే!" అన్నారాయన!

మెరుపు మెరిసినట్లయ్యింది. నా అజ్ఞానం మీద ఓ పిడుగు పడ్డట్ట య్యింది. మా ఫాదర్ నాచేత చేయించిన సంతకాలు గుర్తుకొచ్చాయి. ఆరొందలు అద్దె తెస్తున్న ఇల్లు గుర్తుకొచ్చింది. బయటఉన్న స్కూటర్ గుర్తుకొచ్చింది.

"ఓ ! అదా ! పూర్తయిందండీ ! బాగానే ఆదాయం వస్తున్నదండీ!" అని నసిగేను.

ఆయనగారు మందహాసం చేశారు. చేసి, వీపు తట్టేరు.

అదీ సంగతి ! ఇప్పుడు చెప్పండి ! సుబ్బిగాడికి నేను చేసిన క్షవరం ఏముందిందులో !

పైగా పాతిక రూపాయలు ఉదారంగా అప్పిచ్చానే !

★